# రూపాయి - రూపాయి

ఉపోద్ఘాతమేం లేకుండా సూటిగా విషయం లోకి దిగాడు శంకర్...

''మన ఊళ్ళో మంచివాళ్ళెవరంటే ఎవర్నడిగినా మొదట నీపేరే చెప్పేవారు... అలాంటి వాడివిలా ఎందుకు మారిపోయావు...? నాకు నువ్వంటే ఎంతో గౌరవభావం, ప్రేమ, అభిమానం వుండేవి... నిన్ను నా స్నేహితుడని చెప్పుకుంటానికి గర్వపడేవాన్ని... ఇప్పుడు నువ్వు నాకు స్నేహితుడివైనందుకు సిగ్గుపడుతున్నాను...'' ఆంజనేయుల్ని చుర చురా చూస్తూ శంకర్ అంటున్న ఒక్కొక్క మాట అతనికి శూలాల్లా తాకుతున్నాయి... అయినా ముఖంమీద చిరునవ్వును చెదరనీయలేదు ఆంజనేయులు...

''అలాగా...? అయితే ఇప్పుడేమయింది...'' అన్నాడు మామూలుగా... మిత్రుని దిక్కు కోపంగా చూశాడు శంకర్...

''చదువూ, సంస్కారం వున్న నువ్వూ ఇలా ప్రవర్తించడం నాకు బాధగా వుంది... నువ్వింత స్వార్థపరుడివైతావనుకోలేదు.. కనిపెంచిన తల్లి దండ్రులే నీకిప్పుడు చేదయ్యారా...? వాళ్లకు నీమెదెంత ప్రేముండేదో నాకు తెలుసు... నీకూ వాళ్ళంటే ఎంత ప్రాణమో తెలుసు... పెద్దవాళ్లయిం తర్వాత కొడుకులు రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోతే వృద్ధాప్యంలో వాళ్లగతేం కావాలి...?'' అన్నాడు.

స్నేహితుని మాటలు అతిసున్నితమైన చోట వాడైన ఆయుధంతో దాడిచేస్తే కలిగే బాధ కంటె ఎక్కువ బాధాకరంగా వున్నా ఆ బాధను పైకికనబడనీయకుండా-

''గోరక్‌పూర్ నుంచెప్పుడొచ్చావు...? మన ఊరెళ్ళి వస్తున్నట్టున్నావు...? మన ఫ్రెండ్సంతా బాగున్నారా...?'' అన్నాడు అతి మామూలుగా ఆంజనేయులు...

''నా మాటలు నీకు జోక్‌లా అనిపిస్తున్నాయా...?. నువ్వెంతో తెలివికలవాడివని, పరోపకారివని భావించాను... తల్లిదండ్రులతో కన్నీరు పెట్టించేవాడివి, నువ్వేం మనిషివి...'' క్రోధంగా అన్నాడు శంకర్...

అయినా చలించినట్టు కనబడలేదు ఆంజనేయులు... ''ఐదారేళ్ళ తర్వాత కలుసుకున్న బాల్య సేహితులం... చిన్నప్పట్నుంచీ ప్రాణ స్నేహితులం... ఇన్నేళ్ళ తర్వాత కలుసుకున్న మనం ఆప్యాయంగా పలుకరించుకోవాలి కాని ఇదేంటి..? వస్తూనే నా మీద దాడి ప్రారంభించావు...!'' అన్నాడు.

''నాకు నటనంటే అసహ్యం...? జీవితంలో నటించే వాళ్ళంటే మరీ అసహ్యం... కడుపులో కోపాన్నిదాచుకొని, పైకితీయగా మాట్లాడటం నాకు చేతకాదు... వేరే రాష్ట్రంలో పనిచేస్తున్న నాకు మీ కుటుంబం గూర్చి తెలుసుకునే అవకాశమే కలుగలేదు.. మొన్న ఊరెళ్ళితే నీ బండారమంతా బయటపడింది... నీగురించి అలావినడం నాకు భరించరాకుండా వుంది...'' అన్నాడు శంకర్...

''మా అమ్మ నీ కాళ్ళమీద పడేడ్సింది... అవునా...?''

వాళ్ళు పల్లెటూరివాళ్ళు... మనలా నాగరికత ముసుగులేదు... బాధలుంటేచెప్పుకొనేడుస్తారు... తప్పేముంది...?''

''మా నాన్న వేదాంతిలా నవ్వుతూ నన్ను మంచివాడంటూనే కోడలు వల్లే చెడిపోయానని చెప్పాడు... అంతేనా...?''

ఔనని తలూపాడు శంకర్...

''దే ఆర్ లైసెన్సుడ్ పీపుల్... కన్నారు కాబట్టి తమ పిల్లల మీద ఏదైనా చెప్పే హక్కు వాళ్ళకుంది... తమ సంతానం మీద ఏ నేరమైనా మోపే అధికారం వాళ్ళకుంది... వాళ్ళు నామీద ఆరోపణలు చేసినట్టు నేను వాళ్ళమీద చేయడం సాధ్యమైతుందా...? ఒకవేళ చేసినా నిజానిజాల సంగతెలా వున్నా ముసలివాళ్ళ మీదే సానుభూతుంటుంది... ఇది సహజం...'' అన్నాడు ఆంజనేయులు... ''మాటనేర్పరి తనంతో తెలివిగా మాట్లాడినంత మాత్రాన తప్పులు ఒప్పులైపోవు.. నువ్విలా ఎందుకు మారిపోయావో నాకర్థం కావడం లేదు...?''దాదాపేడు స్తున్నట్టుగా అన్నాడు శంకర్... అతని మాటల్లో మిత్రునిపై ఆప్యాయతుంది... కోపముంది... నిస్సహాయమౌతుంది.

''పెళ్ళయిం తర్వాత పెళ్లాం బెల్లమైంది... తల్లిదండ్రులు చేదయ్యారు... నేను నాభార్య గీసిన గీత దాటడం లేదు... మా వాళ్ళ ప్రకారం నేను మారడానికి కారణమిదే...''

''వాళ్ళేమన్నా నీలాంటివాడుకూడా ఇలా మారడం బాగాలేదు... విషయాలు వింటుంటే పిల్లలు పెద్దవాళ్ళయింతర్వాత పేరెంట్సు చనిపోవడం మంచిదనిపిస్తుంది...''

శంకర్ మాటలకు చలించాడు ఆంజనేయులు.. అతని హృదయం భారమయింది.

''శంకర్! నీకు నాపై వున్న అభిమానానికి కృతజ్ఞతలు... నువ్వు నన్నెక్కువ ప్రేమిస్తావు కాబట్టే నా గూర్చి చెడ్డగా విని ఇంత బాధపడ్తున్నావు.. నేను రచ్చగెలిస్తేగెలవచ్చు కాని ఇంట్లో గెలవని వాన్ని... ఇక ముందు గెలువను కూడా...''

''ఎన్నో విషయాలు తెలిసినవాడివి.... ఎంతో మందికి సలహాలిస్తావు... మరి ఇంట్లో నీ పరిస్థితిలా ఎందుకుంది...? ఊళ్ళో నిన్నా దర్శంగా తీసుకోవాలని ఇది వరకు చెప్పినవాళ్ళే ఇప్పుడు తిడ్తున్నారు...''

''అవును... అది సహజం కూడా... ఇరుగుపొరుగు వాళ్ళతో బాగా లేకుంటే సరేలే అని సరిపెట్టుకోవచ్చు... స్నేహితులతో భేదాభిప్రాయాలొచ్చినా ఎలాగో నెట్టుకు రావచ్చు... కాని, తల్లిదండ్రులే పనిగట్టుకొని నిందలు మోపుతుంటే ఏం చేసేది...?'' అన్నాడు బాధగా ఆంజనేయులు. శంకర్ కొంత తగ్గాడు.

''ఇంతకూ మీ మధ్య ఈ ప్రచ్ఛన్న యుద్ధం సాగడానికి గల కారణం చెప్పనే లేదు...'' అన్నాడు.

''నువ్వు భగవద్గీత చదివావా...?''

''చదువులేదు... కాని తెలుసు...''

''మహాభారతం...?''

''చదివాను...''

''అందులోని ఓ సంఘటనగూర్చి చెబుతాను... మహాభారతయుద్ధం అనివార్యమని తేలింది... కౌరవులు, పాండవులు తమతమ బలాలను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు... శ్రీకృష్ణుని సాయం కోరడానికి పాండవుల తరపున అర్జునుడు, కౌరవుల తరపున దుర్యోధనుడు ద్వారకకెళ్లారు.. నిద్రిస్తున్న శ్రీకృష్ణుడు మేల్కొనే వరకకోపిగ్గా కూర్చున్నారు... విషయం తెలుసుకున్న కృష్ణుడు తన సైన్యమంతా ఒకదిక్కు, తానొక్కడు ఒక దిక్కు అని విభజించాడు... తాను యుద్ధం చేయనని, కేవలం తనకు తోచిన సలహాలిస్తానని చెప్పాడు... అయినా అర్జునుడు కృష్ణున్నే కోరుకున్నాడు... ఈ కాలంలో నయితే అలా ఎవ్వరూ చేయరు... దుర్యోధనుడిలా మిగతా భాగాన్ని కోరుకుంటానికే ఇష్టపడతారు... కాదంటావా...?'' అన్నాడు ఆంజనేయులు...

''నువ్వు కథల్లడంలో నేర్పరివని తెలుసు... నేనడుగుతున్నదేంటి నువ్వు చెప్తుతున్నదేంటి...? ఇప్పుడు మహాభారత కథలన్నీ ఎందుకు...?''

''కథ లెక్కన్నుంచి వస్తాయి...? జీవితం లోంచే కదా! నువ్వడుగుతున్న దానికే నేను సమాధానం చెబుతున్నాను... డబ్బు... డబ్బే ప్రస్తుతం ఈ వ్యవస్థ నేలుతుంది... డబ్బు ముందు ఆప్యాయతలు, అనురాగాలు, బంధుత్వ మమకారాలు అన్నీ దిగదుడుపే... ఇవన్నీ శ్రీ కృష్ణుడిలాంటివైతే, డబ్బు అతడు చెప్పిన సైన్యం లాంటిది... ప్రస్తుతం శ్రీకృష్ణున్ని కోరుకునే అర్జునులుండటం కష్టం...''

ఆంజనేయులు మాటల్లోని లోతునర్థం చేసుకున్నాడు. శంకర్...

''కావచ్చు... అయితే నీ సమస్యను జనరలైజ్ చేసి నీదేం తప్పులేదని తప్పించుకుంటానంటావు...''

''అదేం కాదు... ముందు స్నానం చేసి భోజనం చెయ్యి... సాయంత్రం పార్కు కెళ్ళి మాట్లాడుకుందాం...''

సరేనన్నాడు శంకర్...

భోజనం ముగించి కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాడు...

సాయంత్రం ఇద్దరు కలిసిపార్కుకెళ్ళారు...

''నువ్వు గోరఖ్‌పూర్‌లో ఉంటున్నావు కదా! మరి మీ తల్లిదండ్రులనెలా చూసుకుంటున్నావు...?'' అన్నాడు ఆంజనేయులు.

'' ఆర్నెల్లకోసారి వచ్చిపోతున్నాను... అవసరమైతే అప్పుడప్పుడు డబ్బు పంపిస్తున్నాను...'' అన్నాడు శంకర్...

''దగ్గరే కాబట్టి నేను కనీసం నెలకోసారి ఇంటికెళ్ళొచ్చాను... మొదట్లో నెలకొంత డబ్బు పంపాను...''

''అయినా గొడవలెందుకు...?''

''చెబుతాను... మాకున్న భూమి, ఆస్తి సంగతి నీకు తెలుసుకదా. అది మా అమ్మా నాన్నలు హాయిగా తినడానికి సరిపోతుందా? లేక ఇంకేమైన తక్కువ పడుతుందా...?''

ఆ ఆస్తితో ఇద్దరేం కర్మ మరో నలుగురు హాయిగా బతుకొచ్చు...''

''అయినా నేను డబ్బు పంపాను... విచిత్రమైన విషయమేమంటే నేను డబ్బు పంపుతున్నా ఎప్పుడూ లేంది, నేను చదువు కునేప్పుడూ లేంని అప్పులు పెరుగుతున్నాయని మావాళ్ళ గోల... అప్పుడు నేనేం చెయ్యాలి...? అప్పులెందుకవుతున్నాయంటే గొడవ... ఇద్దరు బతకటానికి భూమిమీద వొచ్చే ఆదాయం, ఇతరాదాయం నేను పంపే డబ్బూ సరిపోవడం లేదంటే ఎలానమ్మమంటావు...?''

అలా అన్నారా వాళ్ళు...? ఈ విషయాలు నాకు తెలియవు...''

''నీకు తెలియని విషయాలింకా చాలా వున్నాయి. నా జీతం మొత్తం తీసుకెళ్ళి మానాన్న చేతిలో పెట్టాలట... అందులోంని ఖర్చులకని నాక్కొంత ఇస్తాడట... ఆ డబ్బును, భూమి మీద వచ్చే ఆదాయం గూర్చి నేనడుగొద్దట... నీకిలాంటి పరిస్థితి వస్తే నువ్వేం చేస్తావు...? మొత్తం జీతం నాన్న చేతిలో పోసి విద్యార్థిగా వున్నప్పుడు ఆడుకున్నట్టు యాభై, నూరు అడుక్కుంటావా...? అప్పుడంటే ఒంటరిగాళ్ళం... మరిప్పుడు భార్య, పిల్లలు...''

ఆంజనేయులు మాటలు వింటున్న కొద్దీ శంకర్ ముఖంలో రంగులు మారుతున్నాయి... ఆ మాటల్లోని నిజాయితీని బేరీజు వేస్తున్నాడు...

''నేనలా చేయడానికైనా సిద్ధమే... కాని ఆ డబ్బు సద్వినియోగమవుతుందని, భవిష్యత్తులో నాకే ఉపయోగపడుతుందని నమ్మకముంటే... ఎప్పుడూ లేంది నాకుద్యోగమైన తర్వాత అప్పులు పెరుగుతున్నాయంటే నేను నమ్మి మొత్తం డబ్బు తండ్రైనంత మాత్రాన అతనిచేతిలో ఎలా పోయాలి...? మరి భవిష్యత్తులో నా పిల్లల గతేం కావాలి...?''

''మరి భూమిపై వస్తున్న ఆదాయాన్ని వాళ్ళేం చేస్తున్నారంటావు...?''

''అదే చెబుతున్నాను... కొంచెమ్ ఆగు...దయచేసి నేను చెప్పేవి కథలనుకోకు... నిజాయితీతోనే, బాధతోనే చెప్పడం తప్పడం లేదు కాబట్టి చెబుతున్నాను...''

ఆంజనేయులు కనుగుడ్ల నిండా నీళ్ళు...

''నాకు నా చెల్లెలును చూసుకోవాల్సిన బాధ్యతుంది... నా తల్లిదండ్రులకు కూడా ఆమెను చూడాల్సిన అవసరముంది... కాని ఆమె సంతానానికి, సంతానం సంతానానికి కూడా పురుళ్ళు, పెళ్ళిళ్ళు, కట్నాలు, కానుకలు ఈ బాధ్యతలన్నీ నేను లేక మా నాన్న మోయాల్సుంటుందా? నువ్వే చెప్పు...

''అట్లని ఎవరన్నారు...?''

''ఎవరన్లేదు... పెళ్ళిలో ఇచ్చిన వరకట్నమేకాక మరికొంత భూమి రాసిచ్చాడు మానాన్న మా చెల్లెలకు... అయినా నేనేమన్లేదు... మాచెల్లె కూతురుకు కూడా మంచి పొలం ఎకరం రాసిచ్చాడు. ఆమె పెళ్ళికి మిగతా ఖర్చుల కన్నిటికీ బాధ్యతవహించాడు... వాళ్ళ కుటుంబమంతా మా ఇంట్లోనే... మరి ఆదాయమంతా ఎక్కడికి పోతుందంటే ఏం చెప్పాలి...?

''నేనెప్పుడూ వినని విషయాలు చెబుతున్నావు...''

'' ఇంకా విను... నేను మా చెల్లిలితో చెప్పాను... నేనుద్యోగం విషయంలో కొంత దూరంగా వుంటున్నాని ఇలా చేయడం బాగుండదన్నాను... నీకు అందరిలా సమాజంలో ఆడబిడ్డలకు జరిగినట్టు లాంఛనాలన్నీ జరిపిస్తాను... అమ్మా నాన్న యిస్తున్నంత మాత్రాన భూమి, డబ్బు తీసుకోవడం బాగుండదు... నీకు జీవితాంతం అన్నయ్యతో మంచి సంబంధాలు కావాలా...? లేక అమ్మానాన్నలు

అక్రమంగా ఇచ్చే ఆస్తే డబ్బే కావాలా..? ఇందులో ఏదో ఒకటి కోరుకో అన్నాను... మా చెల్లి ఏం కోరుకుందో తెలుసా...? రెండవదే... అన్నతో అంటే నాతో మంచిమాటవల్ల వచ్చేదేంటి...?''

''ఇవన్నీ నువ్వు ఆపలేవా...?''

'' ఎలా...? కొట్టా...? తిట్టా...? తన్నా...? లేక కోర్టుకెళ్లా...? ఎవరిమీద యుద్ధం ప్రకటించాలి...? కన్న తల్లిదండ్రుల మీదనేనా...? అన్నీ చూస్తూ, నేను మౌనంగా వుంటున్నా- నన్ను నిందిస్తూనే వున్నారు...

''నువ్వు చెప్పే విషయాలు వింటుంటే నాకాశ్చర్యంగా వుంది... ఈ విషయాలన్నీ నమ్మమంటావా...?''

''నమ్ము... నమ్మకు... అది నీ ఇష్టం.. నాలుగేళ్ళ క్రితం పంచాయితీ పెట్టాడు మా నాన్న... ఆ పంచాయితీలో ఏం చేశాడో తెలుసా...? భూమి పంపకం చేశాడు... ఎకరం పొలం, ఎకరం పెరడునాకిచ్చాడు.. మిగతా పొలం, బంగారం, పశువులు అన్నీ ఆయనకట...

''మరి ఆ అగ్రిమెంటుకు నువ్వెందుకొప్పుకున్నావు...?''

''నాకు తాత ఆస్తిని చెందనీయొద్దనివాళ్ళనుకున్నప్పుడు, నా మీద నమ్మకం లేనప్పుడు ఆస్తి భూమి కొరకు నేనెందుకు ప్రాధేయపడాలి...? అనుభవించనీ... ఎవరికి బాకీ ఉంటే వాళ్లకవుతుంది... ఆ భూమి కూడా నాకక్కరలేదని అది కూడా అమ్ముకో వచ్చని చెప్పి సంతకం చేయ్యమన్న చోట సంతకం చేశాను... ఉన్న ఉద్యోగంతో లక్షలు సంపాదించి పెట్టుకున్నా, ఇద్దరు పిల్లల్ని పోషించుకోలేనా...? నేను చెట్టుకింద పుట్టాననుకుంటానని చెప్పి బయటకొచ్చాను... ఆ కాగితంలో ఏం రాసారో తెలుసా...? ఇప్పట్నుంచీ వాళ్ళనుచూసుకునే బాధ్యత నాది కాదట... అంతకు ముందు ప్రతినెలా పొయ్యేవాడిని, ఆరాత్లైన తర్వాత రెండు, మూడు నెలలకొకసారి ఊరికెళ్ళొస్తున్నాను. . ఇదీ నా పరిస్థితి... నన్నేం చెయ్యమంటావో చెప్పు...! నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను...'' అని ఆగాడు ఆంజనేయులు.. అతని గొంతు గద్గదికతో పూడుకుపోయింది.

''వాళ్ళిలా మారడానికి కారణం నీ భార్య ప్రవర్తనై వుండొచ్చుగదా...?''

''మన సమాజంలోని చాలా కుటుంబాల్లో ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల్లో వున్న సమస్యే ఇది... తనకూతురు తప్పును పదిలంగా కడుపులో దాచుకునే స్త్రీ కోడలు విషయంలో అందుకు భిన్నంగా ప్రవర్తిస్తుంది... తల్లితో ఎన్ని మాటలు పడ్డా, పుట్టింట్లో తన పరిస్థితి ఎలా వున్న అత్త దగ్గిరికొచ్చేసరికి ఘర్షణ విధాన మవలంబిస్తుంది కోడలు.. ఘర్షణ అన్ని కుటుంబాల్లో వున్నదే... కొందరు బయటపడ్తారు. కొందరు దాచుకుంటారు...

''నువ్వన్నది నిజమే... కాని మీ రెండు కుటుంబాల మధ్య ఇంత దూరం ఏర్పడటానికి కారణం అర్థంకావడం లేదు...''

''ఆర్థికంగా మా కంటె మంచిస్థితిలోనే వున్నా మా చెల్లిలిది వ్యవసాయకుటుంబం... నాకు నౌకరీ ఉంది. తనకొడుకు ఉద్యోగం చేయడంవల్ల కోడలు సుఖపడ్తుందని మా అమ్మ అభిప్రాయం... వ్యవసాయప్పనులు చేస్తూ బతికే మా చెల్లిలితో ఉద్యోగి భార్యగా తెల్లబట్టలేసుకొని బతికే నా భార్యను పోల్చడం, ద్వేషం పెంచుకోవడం మొదలైంది... ఎంతో ప్రయత్నించాను... కాని క్రమక్రమంగా ఎడం పెరిగిందే కాని తగ్గలేదు...

ఈ మాటలు చెబుతున్న ఆంజనేయులు గొంతులో జీర...

''ఏదేమైనా మీ తల్లిదండ్రులే నీ మీదంత వ్యతిరేకంగా చెప్పడం బాగాలేదు...'' అన్నాడు శంకర్.

''దోస్త్... ఒక్క విషయం జ్ఞాపకం వుంచుకో... ఓవస్తువును నాశనం చెయ్యాలంటే మొదట దాన్ని ద్వేషించాల... విపరీతంగా ద్వేషించాలి... మా తల్లిదండ్రులు తన ఆస్తిని కూతురు కిచ్చుకోవాలంటే అందుకు కారణముండాలి. నన్ను చెడ్డవాడుగా చిత్రించాలి... మేము వాళ్లను గూర్చి పట్టించుకోని వాళ్ళుగా చిత్రించాలి... కొడుకు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు కాబట్టే తామిలా చేస్తున్నట్టు లోకమనుకునేట్టు నమ్మించాలి... మా కుటుంబంలో వున్న సమస్యలు అన్ని మధ్యతరగతి కుటుంబాల్లో ఉన్నలాంటివైనా వాళ్లలా చేయడానికి నేననుకున్న కారణమిది...''

శంకరం మాట్లాడలేదు... ఆంజనేయులు మాటల గూర్చి ఆలోచిస్తున్నాడు... ఇద్దరి మధ్య కొద్ది నిమిసాలు నిశ్శబ్దం... శంకర్‌దిక్కు చూస్తూ మళ్ళీ ఆంజనేయులే అన్నాడు...

''శంకర్... ఇలా జరగడానికి అసలు కారణమేంటో తెలుసా...? వీటన్నిటి వెనుకున్న శక్తులేంటో తెలుసా...? రూపాయి దోస్త్ రూపాయి...మనిషి చేసిన రూపాయి... అన్ని విలువలను, అనుబంధాలను, మనుషుల మధ్య నున్న సబంధాలను నాశనం చేసే డబ్బు... మాకేమాత్రం ఆస్తిపాస్తులు లేకుంటే-నామీద ఆధారపడి మా తల్లిదండ్రులు బతికితే ఈ పరిస్థితి వుండేది కాదు... నెలకొంత పంపేవాన్ని... వాళ్ళు మౌనంగా వుండేవాళ్ళు... ఇప్పుడు తన ఆస్తినాకు చెందనివ్వ వద్దని వాళ్ళు, నాకు రావాల్సిన ఆస్థి పోతుందని నేను ఒకరికొకరం రోజురోజుకూ దూరమవుతున్నాం... నేను కఠినంగా ప్రవర్తిస్తే సమస్య పరిష్కారమవుతుందేమోకాని కన్నవాళ్ళమీద నేనంత కఠినంగా ప్రవర్తించ లేను... అందుకే ఏ అవసరమూ లేకున్నా రోజుకింత ఆస్తినమ్ము తున్నా, నన్ను తల్లిదండ్రులను చూడనివాడుగా నిందిస్తున్నా మౌనంగానే వుంటున్నాను...'' ఆంజనేయులు కనుకొలుకుల్నుండి రెండు కన్నీటి బొట్లు రాలాయి.

దుఃఖ భరితమైన మిత్రుని ముఖాన్ని చూసి శంకరేం మాట్లాడలేదు... కొద్దీ క్షణలాగి ''మీ కుటుంబంలో ఇంత కథ జరుగుతోందని నాకు తెలియదు. నువ్వు నీ భార్య బిడ్డలకే పరిమితమయి స్వార్థమరుడవయ్యావని మన మిత్రులు కూడా అంటే విని ఆశ్చర్యపోయాను...'' మిత్రులంటే అందరు కాదు.. ఒకరిద్దరు...'' అన్నాడు శంకర్...

''నన్నర్థం చేసుకున్న వాళ్ళెవరూ నన్ననరు... అయినా ఊళ్ళో అంత వ్యతిరేక ప్రచారం జరుగుతుంటే కొందరైనా నమ్మక ఏం చేస్తారు...? ఎందరికని వివరించి చెప్పాలి...? బయటెలా వున్నా నేనింటగెలువని వాన్ని... మా తల్లిదండ్రలకు పనికిరాని కొడుకును నేను... మా తల్లిదండ్రులకే మద్దతుగా మాట్లాడుతానని, రావాల్సినాస్తిని వదులు కుంటున్నానని నా భార్య ఆరోపిస్తుంది... నాపై వ్యతిరేకంగా నిర్విరామంగా ప్రచారం జరగడం వల్ల కొందరు మిత్రులూ నన్నపార్థం చేసుకున్నారు... ఇకనాకు మిగిలిందెవరు...?

''నేను మంచికొడుకునుకాను..మంచి భర్తనుకాను..

నేను మంచి మిత్రుణ్ణి కూడా కాను

అందుకేనేను మంచి తండ్రిని కావాలనుకుంటున్నా'' అందుకే నా పిల్లలేలోకంగా బ్రతుకుతున్నాను.

నేను జీవితంలో ఓడి పోయినవాన్ని... నశిస్తున్న విలువల చేతుల్లో ఓడి పోయినవాన్ని... అని మిత్రన్ని పట్టుకొని భోరుభోరున ఏడుస్తున్నాడు ఆంజనేయులు... ఆయన కళ్ళలో నుంచి కాగుతున్న కన్నీళ్ళు శంకర్ చొక్కాను తడుపుతున్నాయి...

*వార్త కాలం పక్షపత్రిక జూన్ 1-15, 1991*